క్లుప్తంగా

స్మార్ట్ మీటర్ల రద్దుకు డిమాండ్



కోవూరు: స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని కోవూరు బజార్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గండవరపు శేషయ్య మాట్లాడుతూ 'అదాని స్మార్ట్ మీటర్లు బిగించడం పూర్తిగా ప్రజా వ్యతిరేక నిర్ణయమన్నారు. దీనిని వెనక్కు తీసుకోవాలని, అలాగే అదనపు చార్జీలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బుజ్జయ్య, పెద్దన్న, చాన్‌బాషా, సుబ్బారావు, భాస్కర్, మల్లికార్జునరెడ్డి, శివ, గోవర్ధన్, యజ్ఞాని తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని రాఘవరెడ్డి కాలనీ వద్ద కాలువలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 45 ఏళ్ల వ్యక్తి కాలువలో పడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి వివరాలు తెలిసిన వారు బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. పూర్తి వివరాలకు 91828 48516, 94407 96330 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

ఏఆర్ఎస్ శాస్త్రవేత్తల క్షేత్ర సందర్శన



కోవూరు: కోవూరు గ్రామ పరిధిలోని పలు వరి పొలాల్లో ఏఆర్ఎస్ (అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్) శాస్త్రవేత్తలు మధుసూదన, పరమశివ, శ్రీలక్ష్మి సోమవారం క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. తెగుళ్ల నివారణ చర్యల గురించి వివరించారు.

పూజితకు కొండ్రెడ్డి అభినందన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాకాణి పూజితారెడ్డి నియమితులైన నేపథ్యంలో నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సోమవారం అభినందించారు. ఈ మేరకు ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీ నాయకులు పాశం శ్రీనివాస్, ఏసునాయుడు, కొండేటి నరసింహారావు, స్వర్ణ ప్రసాద్, మొయినుద్దీన్ తదితరులు ఉన్నారు.

పలు ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు

నెల్లూరు(అర్బన్): నగరంలోని రెయిన్‌బో హాస్పిటల్, శ్రీరామ్‌మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, అపెక్స్ క్లినిక్ తదితర పలు ఆస్పత్రుల్లో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రులకు సంబంధించిన వివిధ రికార్డులు, రోగులకు అందిస్తున్న సేవలు, స్కానింగ్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ ప్రతి ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యం తప్పనిసరిగా పొల్యూషన్, ఫైర్, బయోమెడికల్ వేస్టేజీ అనుమతి పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఆస్పత్రుల్లో అందిస్తున్న సేవలు, వాటి ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. ఓపీ, ఐపీ రిజిస్టర్లతోపాటు కేస్ షీట్లు పక్కాగా ఉండాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు టీబీకి సంబంధించిన రోగులు వస్తే తక్షణమే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేయాలన్నారు. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ నివారణ సిబ్బంది తులసీరామ్, హరీష్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకపత్రం అందజేత

నెల్లూరురూరల్: ఏపీఎస్ఆర్టీసీలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ మృతిచెందిన పి.సుధాకర్ కుమారుడు రాజేష్‌కు కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పిస్తూ సోమవారం డీఆర్వో హుస్సేన్ సాహెబ్ నియామకపత్రం అందజేశారు. పశుసంవర్ధకశాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా రాజేష్‌కు ఉద్యోగం కల్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ విజయ్‌కుమార్ ఉన్నారు.

డిగ్రీ ప్రవేశాలు ఇంకెప్పుడు?

- కోవూరు నియోజకవర్గంలో వెయ్యి మంది విద్యార్థుల ఎదురుచూపులు



విడవలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఇంటర్ ఫలితాలొచ్చి నాలుగు నెలలవుతున్నా డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల కాకపోవడం విమర్శలకు తావిస్తోంది. జూలై మొదటి వారానికి డిగ్రీ ప్రవేశాలు పూర్తయి తరగతులు ప్రారంభం కావాలి. అయితే ఇప్పటికీ విక్రమసింహపురి యూనివర్సిటీ నుంచి కౌన్సెలింగ్ ప్రకటన వెలువడలేదు. ఓ వైపు ఇంజినీరింగ్ ప్రవేశాలకు ఏర్పాట్లు జరుగుతుండగా, డిగ్రీ ప్రవేశాలపై ఇంతవరకు ఎలాంటి కదలిక లేకపోవడంతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది.

కోవూరు: నియోజకవర్గంలో రెండు ప్రభుత్వ, మూడుకు పైగా ప్రైవేటు డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. ఇందులో సుమారు వెయ్యి సీట్లు అందుబాటులో ఉన్నాయి. గతేడాది ఆన్‌లైన్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించి డిగ్రీ ప్రవేశాలు పూర్తి చేశారు. ఈ ఏడాది ఆన్‌లైన్లో చేయాలా, ఆఫ్‌లైన్‌లో చేయాలా.. అనే దానిపై కొంత కాలంగా తర్జనభర్జన పడుతున్నారు. మరోవైపు డిగ్రీలో సబ్జెక్టుకు సంబంధించి సింగిల్ మేజర్.. డబుల్ మేజర్ అనే దానిపైనే చర్చ నడుస్తోంది. ఈ రెండింటిపై ఇంతవరకు ఉన్నత విద్యా మండలి నుంచి స్పష్టత రాలేదు. ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరేందుకు ఆర్థిక స్తోమత లేని పేద విద్యార్థులకు డిగ్రీనే ఆధారం.

ప్రైవేట్ కళాశాలలకు అనుకూలంగా..

అడ్మిషన్ల ప్రక్రియ ప్రకటనలో జరుగుతున్న జాప్యాన్ని ప్రైవేటు కాలేజీలు తమకు అనుకూలంగా మార్చుకున్నాయి. ఇంటర్ ఫలితాలు వచ్చిన వెంటనే విద్యార్థులను చేర్చుకోవడంతో పాటు మార్కుల జాబితాను, టీసీ, ఇతర సర్టిఫికెట్లను ప్రైవేటు కాలేజీలు సేకరిస్తున్నాయి. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైన వెంటనే ఇప్పటికే చేరిన వారితో దరఖాస్తు చేయించి తమ కాలేజీలను ఆప్షన్లుగా ఎంచుకునే విధంగా ఏర్పాట్లు చేసుకున్నాయి.

ఆఫ్‌లైన్ కోసమే ఆలస్యమా?

డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియను సులభతరం చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022–23లో ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సులువుగా ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్లు పొందేవారు. కూటమి ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి తిరిగి ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్లు చేపట్టేందుకు కుట్ర పన్నుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసమే అడ్మిషన్ల ప్రక్రియ ఇంకా ప్రారంభించలేదని విద్యార్థి సంఘ నాయకులు ఆరోపిస్తున్నాయి.

విద్యార్థులు నష్టపోతున్నారు



సమయానికి అడ్మిషన్లు చేపట్టకపోతే, విద్యార్థులు ఇష్టమైన గ్రూపులు, కావల్సిన కళాశాలలు పొందే అవకాశం కోల్పోతారు. దీంతో ఉన్నత విద్యపై ఆసక్తి తగ్గిపోతుంది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మరో విద్యా సంవత్సరం వృథా కావొచ్చు.

– డాక్టర్ రాగాల రమణయ్య, ప్రొఫెసర్

ఎస్ఈఐఎల్‌కు ప్లాటినం గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికెట్


సర్టిఫికెట్ స్వీకరించిన సీఈఓ

ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని ఎస్ఈఐఎల్ ఎనర్జీ అడ్మిన్ బిల్డింగ్‌కు ప్రతిష్టాత్మక ప్లాటినం గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికెట్ లభించినట్టు కంపెనీ సీఈఓ జనమేజయ మహాపాత్ర సోమవారం తెలిపారు. స్థిరత్వం, పర్యావరణ నిర్వహణపై నిబద్ధత వల్లే విజయవాడలో ఆదివారం నిర్వహించిన గ్రీన్ ఆంధ్రా సమ్మిట్ – 2025లో ఐజీబీసీ ప్లాటినం సర్టిఫికెట్‌ను ప్రధానం చేసినట్టు చెప్పారు. ఏపీ ప్రభుత్వ భాగస్వామ్యంతో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) ఐజీబీసీ సమ్మిట్‌ను నిర్వహించినట్టు వెల్లడించారు.

శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం


స్కూల్ పాత భవనం

తోటపల్లిగూడూరు: మండలంలోని చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాల పాత భవనం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం నేడు కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ భవనాన్ని తొలగించాలని పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నతాధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. సమీపంలోని పాఠశాలలో ఉన్న 600 మంది విద్యార్థులు రోజూ ఆ భవనం వద్ద తిరుగుతుంటారు. అధికారులు స్పందించాల్సి ఉంది.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి


అర్జీని పరిశీలిస్తున్న డీటీ

మనుబోలు: రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై రోజుల తరబడి ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పించుకోవద్దని సిబ్బందికి సూచించారు.

విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరపాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నెల్లూరురూరల్: నగరంలోని ఆర్ఎన్నార్ జూనియర్ కళాశాల హాస్టల్‌లో హేమశ్రీ అనే విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో డీఆర్వో హుస్సేన్‌సాహెబ్‌కు సోమవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు సునీల్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించని కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జిల్లా కార్యదర్శి షారూక్, కమిటీ సభ్యులు నవీన్ హర్ష, పూజిత్, చరణ్ పాల్గొన్నారు.

సీఐపై చర్యలకు డిమాండ్

యువజన సంఘం నాయకులపై లాఠీచార్జ్ చేపట్టిన ఐదో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు వి.నరేంద్ర, ఎన్వీ రమణ, షేక్ మస్తాన్‌లు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ఆర్ఎన్నార్ కళాశాలను సీజ్ చేయాలన్నారు. అక్కడి హాస్టల్ విద్యార్థిని అనుమానాస్పద మృతిపై విచారణ జరిపించాలన్నారు. అనంతరం జేసీ కార్తీక్‌కు వినతి పత్రం సమర్పించారు.

నగరంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



నెల్లూరు(బారకాసు): జిల్లాలోని ప్రజలందరూ దేశభక్తి ఉప్పొంగేలా హర్ ఘర్ తిరంగా – హర్ ఘర్ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపునిచ్చారు. నగరంలోని వీఆర్సీ మైదానంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన హర్ ఘర్ తిరంగా.. హర్ ఘర్ స్వచ్ఛత ర్యాలీని జేసీ సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. వీఆర్సీ నుంచి గాంధీ బొమ్మ వరకు ప్రజలందరూ స్వచ్ఛమైన భారతదేశం కోసం తమ వంతు కృషి చేయాలనే నినాదాలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా.. హర్ ఘర్ స్వచ్ఛత కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ తమ ఇంటిపై మువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేసి, తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సిబ్బంది పాల్గొన్నారు.

కండలేరులో 25.208 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 25.208 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 5,540 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,625, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, మొదటి బ్రాంచ్ కాలువకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

తహసీల్దార్‌కు వినతులు

పొదలకూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం తహసీల్దార్ బి.శివకృష్ణయ్య రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. భూ సమస్యలు, పాస్ పుస్తకాలకు సంబంధించి వినతులు అందినట్టు ఆయన తెలిపారు. వెంటనే వీఆర్వోలకు అందజేసి పరిష్కరించాల్సిందిగా ఆదేశించినట్టు వెల్లడించారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

వెంకటాచలం: గడ్డి మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఇస్కపాళెంలో జరిగింది. సోమవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. ఇస్కపాళెం గ్రామానికి చెందిన కల్లిరెడ్డి బాలయ్య (36) ఆదివారం తన నివాసంలో గడ్డిమందు తాగి కేకలు వేయడంతో బంధువులు గుర్తించి వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. బాలయ్య భార్య మంజుల మూడేళ్ల క్రితం చనిపోయింది. మనోవేదనకు గురై బాలయ్య ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. అతనికి మహిధర్, శశిధర్ అనే ఇద్దరు కుమారులున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. కేసు నమోదు చేశారు.

వీధికుక్కలతో బెంబేలు


పడుగుపడులో వీధి కుక్కలు

కోవూరు: కోవూరు మండల పరిధిలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఎటు చూసినా గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. నెల రోజుల క్రితం కోవూరు బజారు సెంటర్ నుంచి ఓ మహిళ తన పాపను స్కూల్లో వదిలిపెట్టేందుకు వెళ్తున్న క్రమంలో కుక్కల మంద ఒక్కసారిగా మీద పడింది. ఈ క్రమంలో కుక్కల దాడిలో పాపకు తీవ్ర గాయమైంది. అలాగే చిన్న పడుగుపాడులో కుక్కల గుంపు ఓ మహిళను వెంబడించగా, భయంతో పడి గాయపడింది. అదే విధంగా తాజాగా ఎనిమిదేళ్ల బాలుడిపై కుక్క దాడి చేసింది. ఇలా పదుల సంఖ్యలో కోవూరు పరిధిలో కుక్కల దాడిలో మహిళలు, చిన్నారులు గాయపడుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన పంచాయతీ అధికారులు తమకెందుకు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గాయపడిన ఏసీ మెకానిక్ మృతి

నెల్లూరు(క్రైమ్): తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఏసీ మెకానిక్ మరణించాడు. పోలీసుల సమాచారం మేరకు.. పొదలకూరు రోడ్డు ఇందిరానగర్‌లో ఏసీ మెకానిక్ లతీఫ్ (34) నివాసం ఉంటున్నాడు. ఈనెల 8వ తేదీన ఆయన తన అన్న సలీమ్‌తో కలిసి హరనాథపురంలోని ఓ ఇంట్లో ఏసీ ఇన్‌స్టాలేషన్‌కు వెళ్లాడు. మూడో అంతస్తులో కంప్రెషర్ బిగించే క్రమంలో లతీఫ్ కాలుజారి పక్క మిద్దె టెర్రస్‌పై పడడంతో తల, ఛాతీకి గాయాలయ్యాయి. వెంటనే అతన్ని సలీమ్ హుటాహుటిన చికిత్స నిమిత్తం నారాయణ హాస్పిటల్‌కు అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం చెన్నై ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం లతీఫ్ మృతిచెందాడు. ఈ మేరకు మృతుని బంధువు పర్వేజ్ బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై పుల్లారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలుష్యాన్ని నియంత్రించాలంటూ ధర్నా


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని పంటపాళెం పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యాన్ని నియంత్రించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు, కార్యకర్తలు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తుకూరు మండల కమిటీ సభ్యుడు దుంపల ఏడుకొండలు మాట్లాడుతూ పంటపాళెం పంచాయతీలో 13 పామాయిల్ ఫ్యాక్టరీలు ఉన్నాయని, వాటి ద్వారా వెలువడే కాలుష్యం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. సీఎస్ఆర్ నిధుల నుంచి నెలకు 30 కిలోల బియ్యం, రూ.3 వేల నగదు అందజేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మత్స్యకారేతర ప్యాకేజీని మిగిలిన మొత్తాన్ని పంపిణీ చేయాలన్నారు. ధర్నాలో మస్తాన్ సాహెబ్, రంగయ్య, శేషయ్య, పుల్లయ్య, మహిళలు పాల్గొన్నారు.

పన్ను బకాయిలపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న కమిషనర్ బాలకృష్ణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన పన్ను బకాయిలపై సిబ్బంది దృష్టి సారించాలని నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. ఆయన తన కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్యాక్స్ రివిజన్ సర్వే ద్వారా సేకరించిన డేటా మేరకు నూతన భవనాలను పన్ను పరిధిలోకి తీసుకురావాలన్నారు. అదనపు అంతస్తులకు పన్ను విధించి, ఖాళీ స్థలాల పన్నులను వందశాతం వసూలు చేయాలని సూచించారు. తాగునీటి కుళాయిలను గుర్తించి వాటిని క్రమబద్ధీకరించాలన్నారు. సమావేశంలో రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పొలం ఆక్రమణకు టీడీపీ నేత యత్నం

- విచారించి న్యాయం చేయాలని వినతి


తహసీల్దార్‌కు పొలం పత్రాలు చూపుతూ సమస్యను వివరిస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం మజరా టపాతోపులో 131–1, 131–2, 133–బి సర్వే నంబర్‌లోని 2.19 ఎకరాల మాగాణి భూమిని నార్తురాజుపాళెనికి చెందిన టీడీపీ నేత తువ్వర ప్రవీణ్‌కుమార్ ఈనెల 7వ తేదీన ఆక్రమించేందుకు యత్నించారని ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియలు తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డికి సోమవారం విన్నవించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ టపాతోపులో వీరి వాణికి 2.19 ఎకరాల పట్టా పొలముందన్నారు. ఈ భూమిపై కన్నేసిన టీడీపీ నాయకుడు ప్రవీణ్‌కుమార్ పొలం యజమాని గ్రామంలో లేదని తెలుసుకుని ఈనెల 7న ఆక్రమణకు యత్నించారని చెప్పారు. పొలంలో జేసీబీలను పెట్టి మట్టి తీస్తుండగా యజమాని కారు డ్రైవర్ కళాధర్ గుర్తించి అతన్ని ప్రశ్నించారన్నారు. దీంతో కోపోద్రేక్తుడైన ప్రవీణ్‌కుమార్ దుర్భాషలాడడంతో పాటు పోలీసులకు కళాధర్‌పై ఫిర్యాదు చేశారని చెప్పారు. అధికార పార్టీ అండతో పట్టా పొలాన్ని సైతం ప్రవీణ్‌కుమార్ ఆక్రమిస్తున్నారని తెలుపుతూ పొలానికి సంబంధించిన పాసు పుస్తకాలు, రిజిస్ట్రేషన్ పత్రాలను చూపారు. విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు. తహసీల్దార్ సమాధానమిస్తూ విచారించి తగిన చర్యలు తీసుకొంటానని హామీ ఇచ్చారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని సామగ్రి చోరీ



విడవలూరు: ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరుతో పాటు ఇతర వస్తువులను చోరీ చేసిన ఘటన మండలంలోని మన్మథరావుపేట గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. విడవలూరు సమీపంలోని జాన్‌పేట గ్రామానికి చెందిన నక్కా సుమన్ అనే రైతు పొలాలు మన్మథరావుపేటలో ఉన్నాయి. సోమవారం ఉదయం తన పొలాల్లోకి వెళ్తున్న క్రమంలో రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ పడి ఉండడాన్ని గమనించి లైన్‌మెన్ ఆరీఫ్ బాషాకు సమాచారం అందించారు. ఆయనతో పాటు విద్యుత్ శాఖ ఏఈ విజయలక్ష్మి ఘటనా స్థలానికి చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగివైరుతో పాటు ఆయిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై నరేష్ కేసు నమోదు చేశారు.

ప్రసన్న తల్లికి పరామర్శ


ప్రసన్న తల్లిని పరామర్శిస్తున్న కాకాణి కుటుంబ సభ్యులు

కోవూరు: మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తల్లి శ్రీలక్ష్మమ్మను ఆమె నివాసంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి సతీమణి విజిత, కుమార్తె పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ప్రెసిడెంట్ పూజిత సోమవారం పరామర్శించారు. మనోధైర్యంతో ఉండాలని భరోసా ఇచ్చారు. టీడీపీ నేతల దాడుల సంస్కృతిని తీవ్రంగా ఖండించారు. వారి వెంట ప్రసన్న కుమారుడు నల్లపరెడ్డి రజత్ కుమార్‌రెడ్డి ఉన్నారు.

ఆర్టీసీ అలా.. ఆటోలిలా..

- సమయానికి రాని బస్సులు
- ప్రమాదకరంగా ప్రయాణం


ఎండలో బస్సుల కోసం బస్టాండ్‌లో వేచిఉన్న ప్రయాణికులు

పొదలకూరు: ఆర్టీసీ అధికారుల తీరు కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నష్టాలతో బస్సు సర్వీసులను నడపలేకున్నామని వెల్లడించే అధికారులు ఆటోలను నియంత్రించడంలో వైఫల్యం చెందుతున్నారు. దీనికితోడు బస్సు సర్వీసులు వస్తే ఒకే సమయంలో నాలుగైదు రావడం, లేకుంటే గంటసేపు బస్సే లేకుండా పోవడంతో విసిగెత్తుతున్న ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. పొదలకూరు పంచాయతీ బస్టాండ్‌లో ప్రతి నిత్యం ఈ తంతే నడుస్తోంది. గతంలో ఆర్టీసీ లోడర్ పోస్టును ఏర్పాటు చేసి విశ్రాంత కండక్టర్లను నియమించి ఆటోలు బస్టాండ్‌లోకి రాకుండా చర్యలు తీసుకున్నారు. కొంతకాలంగా లోడర్ పోస్టు లేకపోవడంతో బస్టాండ్‌లోకి విచ్చలవిడిగా వస్తున్నాయి.

వేచి ఉండలేక..

ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండలేక ఆటోలను ఆశ్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకే కాకుండా పొదలకూరు – నెల్లూరు, పొదలకూరు – సంగం, పొదలకూరు – రాపూరు, పొదలకూరు – కలువాయి తదితర మార్గాల్లో ఆటోలు తిరుగుతున్నాయి. కొందరు డ్రైవర్లు ప్రమాదకర స్థితిలో ప్రయాణికులను ఎక్కించుకుని తీసుకెళ్తున్నారు. పొదలకూరు పంచాయతీ బస్టాండ్‌కు చుట్టుపక్కల రాపూరు, సైదాపురం, మనుబోలు, కలువాయి, చేజర్ల మండలాల నుంచి ప్రయాణికులు వస్తుంటారు. వీరు బస్టాండ్‌లో దిగి వివిధ మార్గాల గుండా రాకపోకలు సాగిస్తుంటారు. సకాలంలో బస్సు సర్వీసులు లేకపోవడంతో ఆటోల్లో ప్రయాణం చేస్తున్నట్టు వెల్లడిస్తున్నారు. రద్దీగా ఉంటే పొదలకూరు బస్టాండ్‌లో ఆర్టీసీ లోడర్ పోస్టును తిరిగి నియమిస్తే ఫలితం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


ఆర్టీసీ బస్సుల ముందు పెట్టి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుంటూ..


ఆటో ఎక్కుతున్న ప్రయాణికులు